విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 06 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ వినతి

విశాలాంధ్ర-కనిగిరి : మున్సిపాలిటీ పరిధిలోని కాశి రెడ్డి కాలనీలో ఇల్లు లేని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 60 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసీన్, మండల కార్యదర్శి జిపి రామారావు కోరారు. సోమవారం ఉప తాహశీల్దార్ రామన కిషోర్‌కు ఇంటి స్థలాల నిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వ భూమి అయినా సర్వే నెంబరు 19లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఉప తాసిల్దార్ స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యేలా చొరవ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఖాసిం పీరా, సుబ్బారావు, షాహిద్, రాము ,పవన్ కళ్యాణ్, అంకమ్మ, ఆదిలాక్ష్మమ్మ, జయం అంకమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన
వివరాలు 2 లో

అంతిమ విజయం ఏలూరిదే..
వివరాలు 3 లో

ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదుర్కోవాలి..
వివరాలు 4 లో

టీడీపీలో ప్రతీ కార్యకర్తకు గుర్తింపు..
వివరాలు 6 లో

ఎన్నికల నిర్వహణపై కసరత్తు..!

- కేంద్రం ప్రత్యేక దృష్టి
- ఓటరు జాబితాలు సిద్ధం
- ఈవీఎంలు రెడీ
- జిల్లా అధికారుల బదిలీలు ప్రారంభం
- ఇప్పటికే ఎస్పి బదిలీ
- టోల్‌గేట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు
- అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీల కసరత్తు
- జిల్లాలో మొదలైన ఎన్నికల వేడి

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించారు. ఇప్పటికే 8 నియోజకవర్గాల్లో ఓట్ల తుది జాబితాను కలెక్టర్ ప్రకటించారు. జిల్లా ఎస్పీతో సహా రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు బదిలీ అయ్యారు. మరికొంతమంది బదిలీకి రంగం సిద్ధమైంది. ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయి. టోల్‌గేట్‌ల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కోట్ల రూపాయల నగదును పట్టుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే అభ్యర్థుల జాబితాపై రాజకీయ పార్టీలు దృష్టి సారించారు. జిల్లాలో వైసీపీ అభ్యర్థుల జాబితా ఎంపిక పూర్తి కాగా టీడీపీ, జనసేనపార్టీల అభ్యర్థుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో ఎన్నికల నిర్వహణపై కసరత్తు ప్రారంభించారు.

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాలకు ఎన్నికల మార్గదర్శకాలను విడుదల చేశారు. ఫిబ్రవరిలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఓటరు జాబితాను అధికారికంగా ప్రకటించారు. అధికారుల బదిలీలు ప్రారంభం అయ్యాయి. జిల్లా ఎస్పి మలిక గర్గ్‌ను చిత్తూరుకు బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఇప్పటికే జిల్లాలో 36 మంది తహశీల్దార్లు బదిలీ అయ్యారు. అదే విధంగా ఎంపీడీవోలతో పాటు జిల్లా స్థాయి అధికారులు కూడా బదిలీకి రంగం సిద్ధమైంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సజావుగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అన్ని రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు వరుసగా నిర్వహిస్తున్నారు. జిల్లాకు అవసరమైన ఈవీఎంలు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. దానికనుగుణంగా జిల్లా అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక మార్గదర్శకాలను మిగతా 2 లో ...

బాపట్ల ఎంపీ సీటు
దగ్గుమళ్ల ప్రసాదరావుకే..

- టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ
- ఎంపీ సీటుపై స్పష్టమైన హామీ
- ఆయనవైపే సర్వేలు మొగ్గు
- అసెంబ్లీ స్థానాలకు ఫెచ్చింగ్

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : రానున్న ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే సీటు కేటాయించేలా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మూడుసార్లు వరుస సర్వేలు చేసుకుని సర్వేల్లో ముందు వరుసలో ఉన్న వారికే సీటు కేటాయిస్తున్నారు. దీనిలో రాజకీయంగా అత్యంత చైతన్యం కలిగిన బాపట్ల పార్లమెంట్ స్థానంలో టీడీపీ క్లీన్‌స్వీప్ చేయాలని పక్కా ప్లాన్‌తో ఉంది. బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా గత ఎన్నికల్లో నాలుగు స్థానాలను టీడీపీ గెలుపొందింది. జగన్ వేవ్‌లో కూడా టీడీపీ నాలుగు అసెంబ్లీ స్థానాల్లో స్పష్టమైన మెజార్టీతో గెలిపొందింది. కానీ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన శ్రీరాంమాల్యాద్రి ఓటమి చెందారు. ఈ సారి ఎట్టిపరిస్థితుల్లో బాపట్ల పార్లమెంట్ కైవసం చేసుకోవాలని స్థానికుడు సౌమ్యుడిగా, ప్రజాబలం ఉన్న దగ్గుమళ్ల ప్రసాదరావుకే చంద్రబాబు లైన్ క్లియర్ చేసినట్లు తెలిసింది. 2024 ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు పోటీ చేసే ప్రతి స్థానం నుంచి గెలిచే అభ్యర్థులకే ఖరారు చేయనున్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని స్థానికుడు విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకే ఎంపీ సీటు ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతంది. స్థానికుడుగా విద్యావేత్తగా ఆర్థికంగా బలం అన్నీ కోణాల్లో పరిశీలించి ప్రసాదరావుకే చంద్రబాబు మొగ్గు చూపినట్లు తెలిసింది. పర్చూరు నియోజకవర్గం తన స్వగ్రామం కాగా బాపట్ల నియోజకవర్గంలోని ఖాజీపాలెంలో అతని కుటుంబీకులు అధిక సంఖ్యలో ఉన్నారు. పార్లమెంట్ వ్యాప్తంగా ప్రసాదరావు బంధుగణం ఉండటంతో ప్రసాదరావు గెలుపు సునాయాశమే అనే చర్చ జరుగుతుంది.

టీడీపీ ఆఫీస్ నుంచి దగ్గుమళ్లకు ఫోన్..

దగ్గుమళ్ల ప్రసాదరావుకు టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ రావటంతో చంద్రబాబును ఆయన కలిశారు. సుదీర్ఘంగా చంద్రబాబుతో జరిగిన భేటీలో బాపట్ల పార్లమెంట్ పరిధిలో పరిస్థితులపై బాబు ఆరా తీసినట్లు తెలిసింది. ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ బలం ఎంతా ఏ మాత్రం ఓటర్లను ప్రభావితం చేయగలరు.. మీకున్న బలం ఏంటీ అని ప్రసాదరావును అడుగగా ఇచ్చిన వివరణతో చంద్రబాబు సైతం సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదేవిధంగా ఎన్నికల ప్రచారానికి ప్రసాదరావు సిద్ధం చేసుకున్న ప్లాన్ సైతం చంద్రబాబుకు తెలపగా మిగతా 2 లో ...

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు తరిమికొట్టండి : జేబీ శ్రీధర్

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తరిమికొట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్డి భాగ్య శ్రీధర్ పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ పాలన విధానాలకు వ్యతిరేఖంగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మిగతా 2 లో ...

అర్జీలు పునరావృతం కాకూడదు: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల: స్పందనలో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు మా సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలను కలెక్టర్‌కు సమర్పించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం ఈనెల 9వ తేదీన ఉన్నందున మిగతా 2 లో ...

అర్జీలు పునరావృతం కాకూడదు

(మొదటి పేజీ తరువాయి) వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా రూపొందించిన గోడ పత్రికలు,కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు.స్పందనలో వచ్చే అర్జీలు గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.క్షేత్రస్థాయిలో వస్తున్న అర్జీలు సక్రమంగా పరిష్కరించక పోవడంతోనే పునరావృతం అవుతున్నాయన్నారు.ప్రజల నుంచి వచ్చే అర్జీలు గడువులోగా పరిష్కరించాలన్నారు.ప్రజల్లో విశ్వసనీయత కల్పించాలన్నారు.జిల్లా పంచాయతీ శాఖలో మూడు అర్జీలు పునరావృతం కాగా,ఆర్డీవోల వద్ద రెండు చొప్పున పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు.సర్వే ల్యాండ్స్ రికార్డు వద్ద మూడు,విద్యుత్ శాఖలో రెండు,ఇలా వివిధ శాఖల్లో మరికొన్ని పునరావృతమైనవి పెండింగ్‌లో ఉండడంపై సమీక్షించారు.అధికారులు అందరిని సమన్వయం చేసుకుంటూ సమర్థంగా పనిచేయాలన్నారు.గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీన అన్ని గ్రామాలలో జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు.నిర్దేశించిన అంశాలకు సంబంధించిన ఆయా శాఖలలో పురోగతిని అధికారులు నిశితంగా పరిశీలించాలన్నారు. గ్రామాలలో పర్యటించే అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను స్పష్టంగా నివేదించాలన్నారు.అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు.నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థినీ,విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలు, కళాశాలలో సంబంధిత మాత్రలు పంపిణీ చేయాలన్నారు.ఇంటి స్థలాల దరఖాస్తుల నమోదు ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు.రీ సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాలలో రోవర్స్ యంత్రాలు వినియోగించి శాశ్వత ధ్రువపత్రాలు సిద్ధం చేయాలన్నారు.ఇందుకోసం జిల్లాకు విడుదలైన రూ.80 లక్షల నిధులను వినియోగించుకోవాలన్నారు.జిల్లాకు ఒక లక్ష ఆయుష్మాన్ భారత్,వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయన్నారు.వాటిని తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆర్డీవోలు,ఎంపిడిఓలను ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఎంపీ సీటు దగ్గుమళ్ల ప్రసాదరావుకే..

ఆయన సుముఖత వ్యక్తం చేశారని అత్యంత విస్వసనీయ సమాచారం. ఇటీవల బాపట్లలో జరిగిన దగ్గుమళ్ల ప్రసాదరావు బాపట్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపరిచయ వేదిక విజయవంతం అయ్యింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి వేలాదిగా కార్యకర్తలు, పార్టీశ్రేణులు తరలి వచ్చారు. అప్పటి నుంచి పార్లమెంట్ పరిధిలో ప్రతి నోట ప్రసాదరావు మాటే వినిపిస్తుంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే వేల సంఖ్యలో జనసమీకరణతో బాపట్ల కిక్కిరిసింది. ఒక నాయుడు అరంగ్రేటం సభ ఆ స్థాయిలో జరగటం ఇదే తొలిసారి అని చర్చించుకుంటున్నారు. స్థానికుడిగా సౌమ్యుడిగా పేరున్న ప్రసాదురావుకు గెలుపు ఖాయమే అని అతని రాకతో బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు ప్రసాదరావు ప్రభావం చూపి అన్నీ స్థానాలు టీడీపీ కైవసం చేసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుంటున్నారు.

ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - కర్లపాలెం : ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా కర్లపాలెం మండలం, పెదమార్పువారిపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొంతా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాపట్లలో జరిగిన ఎస్టీయూ జిల్లా 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారని ఎస్టీయూ కర్లపాలెం మండల అధ్యక్షులు వై.గుడేరంకయ్య తెలిపారు.ఎస్టీయూ జిల్లా ఆర్థికకార్యదర్శిగా ఎన్నికైన బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాన్ని స్థాపించి గత 18 సంవత్సరాలుగా మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ సంఘ అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు.ప్రభుత్వం వెంటనే సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్దరించాలని, ఉద్యోగులకు ఐఆర్ 25శాతం ప్రకటించాలని,117జీ.ఓను రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్టీయూ కర్లపాలెం మండల ప్రధాన కార్యదర్శి ఓ.శ్రీనివాసరావు,ఆర్థిక కార్యదర్శి బి.సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు పి.రామారావు, వై.తిరుపతయ్య,బి.శ్రీనివాసరావు, ఏ.సంగీతబాబు, ఎన్.బి సుభానీ, పి.వెంకటరావు, పి.పరిశుద్ధరావు, డి.ఆదినారాయణ, టి.కొండలరావు, కె.బుజ్జిబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన : ఎమ్మెల్యే కోన

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసి మీ అందరికి నేనున్నానని జగన్ హామీ ఇచ్చారని చెప్పారు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు 4 విడత ఆరు కోట్ల ముప్పై మూడు లక్షలు అందజేస్తారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి వాలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల ముంగిట్లోకి పథకాలను అందజేశారన్నారు. కులం చూడలేదు మతం చూడలేదు అర్హతే ప్రమాణికంగా తీసుకొని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఒక్క జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ఒక ఓటును మన సీఎం వైఎస్ జగన్‌కు మరో ఓటును కోన రఘుపతి వేసి మంత్రిగా చేయాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ రాజు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్ సాకారం చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి సొంత ఇంటికి కల నెరవేర్చాలని ఇళ్ల స్థలాలు పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర చరిత్రలోనే ఒక అధ్యాయంగా తిరగరాసారని తెలిపారు. ఇల్లు పట్టాలు రిజిస్ట్రేషన్ కూడా జగనన్న ఉచితంగా చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పాఠశాల ఇంగ్లీషు మీడియం తీసుకొని వచ్చారన్నారు. వైద్య కోసం గుంటూరు ఇతర పట్టణాలు నగరాల్లో వెళ్లి వారని కానీ ఇప్పుడు మన గ్రామంలో వైద్య శాలలు నిర్మించారు ఎల్లో మీడియాను నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏపిఆర్డి కొల్లిపర్ల పద్మజ, వైసిపి ఏపిఎం సంతోష్ కుమార్, ఎంపీపీ దెందుకూరి సీత రామరాజు,కంఠం అనూష ప్రసన్నరాజు, మంతెన గంగరాజు కూసం పూడి దేవేందర్ రాజు,మండే విజయ్ కుమార్, బడుగు ప్రకాష్, ఉయ్యూరు లీల శ్రీనివాస్ రెడ్డి ,హుస్సేన్ ,శ్యామల నాగిరెడ్డి, చేబ్రోలు కృపానందం,దెబ్బకూటి మాధవరావు, ఎనుముల శివపార్వతి, అశ్విని రెడ్డి, బలగాని అరుణ్ కుమారి, ఉప్పు చెంచులక్ష్మి, కృష్ణకుమారి, యానిమేటర్లు, వివిధ గ్రామాల డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ, జనసేన ధ్యేయం

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు సేవలు అందించేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ముందుకు వస్తున్నామని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. టీడీపీ జనసేన సంయుక్తంగా ఇంటింటికి తెలుగుదేశం మీ మాట - నా బాట మండలంలోని కొండుబోట్లవారి పాలెం,బేతపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ ఏడాదిలో మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఏడాదికి రూ.15 వేలు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక పథకాలు అందిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయుచున్నానని తనని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. జనసేన పార్టీ కోఆర్డినేటర్ నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలంటే జనసేన టీడీపీతోనే సాధ్యమన్నారు. అవినీతిపరుడు అయిన స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతిని ఓడించే దిశగా జనసేన, టిడిపిలు కలసి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై కసరత్తు..!

(మొదటి పేజీ తరువాయి) విడుదల చేశారు. వాటికనుగుణంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. ఒంగోలు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు మినహాయిస్తే మిగిలిన ఏడు నియోజకవర్గాలకు అభ్యర్థులను వైసీపీ అధిష్టానం ప్రకటించింది. యర్రగొండపాలెం నుంచి చంద్రశేఖర్, గిద్దలూరు నుంచి నాగార్జునరెడ్డి, మార్కాపురం నుంచి అన్నా రాంబాబు, కనిగిరి నుంచి దద్దాల నారాయణ యాదవ్, కొండేపి నుంచి ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడు నుంచి మేరుగ నాగార్జున, దర్శి నుంచి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్లను ప్రకటించారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వైసీపీ నుంచి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైయస్ అనిల్‌పేర్లు వినిపిస్తున్నాయి. ఒంగోలు అసెంబ్లీ నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు పరిశీలనలో ఉంది. అభ్యర్థుల ఎంపికలో వైసీపీ అధిష్టానం ముందుందని చెప్పవచ్చు. ఈ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో అభ్యర్థుల జాబితాను వైసీపీ ముందుగానే ప్రకటించడంతో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అసంతృప్తులను బుజ్జగించుకుంటూ ఎన్నికల వ్యూహాలను రచిస్తూ జనంలోకి వెళ్లారు.

మరోపక్క తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్నాయి. దీనిలో భాగంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం, ఒక నియోజకవర్గంలో జనసేన అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉంది. ఈ మేరకు ఆదివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జనసేన నేత పవన్ కళ్యాణ్ బేటీ అయ్యారు. ఈ బేటీలో అభ్యర్థుల ఎంపిక సీట్లు సర్దుబాటు ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో దర్శి నియోజకవర్గం జనసేన అభ్యర్థి బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇక పోతే ఒంగోలు, సంతనూతలపాడు, కొండేపి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వైపాపాలెం నియోజకవర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు బరిలో దిగనున్నారు. అయితే వైసీపీలో అసంతృప్తిగా ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అదే నిజమైతే కొన్ని నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం కూడా లేకపోలేదు. దీనిపై కూడా తెలుగుదేశం పార్టీ అధిష్టానం దృష్టి సారించినట్లు సమాచారం. ఏదేమైనా మరోవారం రోజుల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటు తెలుగుదేశం, జనసేన పార్టీలో పూర్తయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ఘనంగా జయహో బీసీ బైకు ర్యాలీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మార్కాపురం టిడిపి ఇన్చార్జి కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి జయహో బిసి మోటార్ బైక్ ర్యాలీ సోమవారం సాయంత్రంనాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు ఈర్యాలీని ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజీ జండా ఊపి ప్రారంభించారు. మండల కేంద్రమైన కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎదురోళ్లపాడు అంబాపురం రేగడపల్లి బోడపాడు గ్రామాల మీదుగా వాగుమడుగు సాగింది ఈ సందర్భంగా జయహో టిడిపి జయహో బీసీ టిడిపి జిందాబాద్ కందుల నాయకత్వం వర్ధిల్లాలి చంద్రబాబు జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు ఎం బాబురావు బిసి సెల్ మండల అధ్యక్షుడు అంకాల రోశయ్య మాజీ కన్వీనర్ నరసింహారావు మాజీ ఏఎంసీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య తెలుగు యువత నాయకులు పిసుకుదేవ్ కాశిరెడ్డి భాషాపతి నాయుడు భీమాంజనేయరెడ్డి కృష్ణారెడ్డి రాజమోహన్‌రెడ్డి శ్రీకాంత్ ముప్వా కాటమరాజు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు తరిమికొట్టండి

(మొదటి పేజీ తరువాయి) తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాతో పాటు కార్మికులు,కర్షకులు హక్కులను కాలరాస్తుందన్నారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కార్మిక, రైతు, కౌలు రైతు,వ్యవసాయ కార్మికుల పట్ల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని తెలిపారు. పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజల నెత్తిన భారాలు మోపటమే కాక వ్యవసాయ,పారిశ్రామిక రంగాలను,ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నారని తెలిపారు.దేశంలోని కొంతమంది కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను ధారపోస్తూ ఆదాని,అంబానీలకు ఊడిగం చేస్తున్నారన్నారు. ఇటువంటి స్థితిలో రైతులు,వ్యవసాయ కార్మికులు,సంఘటిత,అసంఘటిత కార్మికులు సంఘటితంగా మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై 16న జరుగు సమ్మెను జయప్రదం చేసి మోడీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముత్తిరెడ్డి శ్రీనివాసరావు,మామిడి బత్తుల వెంకటేశ్వరరావు,పల్లప్రోలు ఫణీంద్ర బాబు, పి.శ్రీను, మామిడి బత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి సీఐగా షమీముల్లా బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర-దర్శి : దర్శి సీఐగా షమీముల్లా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామకోటయ్య కంభం బదిలీపై వెళ్లారు. సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని శాంతి భద్రతలపై దృష్టి పెడతానని అన్నారు. ఎస్సైలు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కురిచేడు ఎస్ఐగా సుమన్

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడు ఎస్ఐగా ఆర్. సుమన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు నుంచి ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ సబ్ ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన దేవకుమార్ బదిలీ చేశారు.

తహసీల్దార్‌గా సుధాకర్..

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడు తహసీల్దార్‌గా ఏ.వి. సుధాకర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా ఈపూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్‌గా పనిచేసిన నరసింహం పలనాడు జిల్లా చిలకలూరిపేటకు బదిలీపై వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సుధాకర్ తెలిపారు.

వెలిగండ్ల తహసీల్దార్‌గా హేమంత్ కుమార్

విశాలాంధ్ర-వెలిగండ్ల : వెలిగండ్ల తహసీల్దార్‌గా పసుపులేటి హేమంత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నుంచి బదిలీపై వచ్చారు. హేమంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు, రైతులు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని తెలిపారు.

చీరాల రూరల్ ఎస్ఐగా శివకుమార్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల రూరల్ ఈపురుపాలెం ఎస్ఐగా ఎం. శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. గతంలో సంతమాగులూరులో పని చేసి వీఆర్‌కు.. అక్కడి నుండి ఈపురుపాలెం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పనిచేసిన ప్రతిచోట మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

చీరాల ఆర్డీవోగా సూర్యనారాయణరెడ్డి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల రెవిన్యూ డివిజన్ అధికారిగా జీ సూర్యనారాయణ రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

చీరాల తహసీల్దార్‌గా నాసరయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల తహసీల్దార్‌గా కె.నాసరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లావట్టి చెరుకూరు మండలంలో విధులు నిర్వహించిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా చీరాలకు బదిలీపై వచ్చారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న జీవిగుంట ప్రభాకరరావు పల్నాడు జిల్లా పెదకూరపాడుకు బదిలీపై వెళ్లారు.

పీసీపల్లి తహసీల్దార్‌గా పద్మావతి

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి నూతన తహసీల్దార్‌గా ఆరవ పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా కోట మండలం నుంచి బదిలీపై వచ్చారు.,, ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన కే ప్రవీణ్ కుమార్ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు.

సింగరాయకొండకు.. రామయ్య

విశాలాంధ్ర-సింగరాయకొండ : సింగరాయకొండ తహసీల్దార్‌గా రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా తెల్లకూరు నుంచి వచ్చారు. ఇక్కడి ఉష పల్నాడు బదిలీపై వెళ్లారు.

అంతిమ విజయం 'ఏలూరి'దే..

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రశాంతంగా ఉన్న పర్చూరులో అలజడులు, అరాచకాలు సృష్టించినా, ఎన్ని కుట్రలు చేసిన అంతిమ విజయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుదేనని టిడిపి మండల నాయకులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ బలమైన నేతగా ప్రజాదరణ కలిగిన సాంబశివ రావును రాజకీయంగా ఎదురుకోలేక వైసిపి పెద్దలు కుట్రలకు పాల్పడుతున్నారని మండిప డ్డారు. గత 12 ఏళ్లుగా పర్చూరు నియోజకవర్గ ప్రశాంత వాతావరణంలో అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు.ఏడాదికాలంగా వైసిపి ఇంచార్జ్‌గా వచ్చిన ఆమంచి కృష్ణమోహన్ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.అందిన కాడికి దోచుకుంటూ,ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భయానక వాతావరణ సృష్టిస్తున్నారని మండిపడ్డారు.ఇసుక మైనింగ్ రేషన్ బియ్యం దోపిడీతో అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆరోపించారు.దొంగ ఓట్ల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి గ్రామాలలో అలజడి సృష్టిస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న పర్చూరు పల్లెల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు.ఆమంచి అనే వ్యక్తి పర్చూరు పట్టినదరిద్రం అన్నారు.

ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసి ఏం సాధించేందుకు ఇక్కడకు వచ్చారని ప్రశ్నించారు. ఆయన ప్రతిష్టను దెబ్బతీసేందుకు రకరకాలుగా ఆరోపణలు చేస్తూ అక్రమాలను అండగడుతున్నారన్నారు. ప్రజాసేవ లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమం ఊపిరిగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఏలూరిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. అధికారం కోసం రాజకీయంగా పోటీ పడలేక తప్పుడు అక్రమ కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు.ఏలూరి అంటే ఒక భరోసా ఒక నమ్మకం అలాంటి వ్యక్తిపై నిందలు మోపి అక్రమ కేసులు బనాయిస్తే నమ్మే ప్రజలు ఎవరూ లేరన్నారు. ఆయన మంచితనం ఆప్యాయతే ఆయనకు శ్రీరామరక్ష అన్నారు.రౌడీలతో వచ్చి గ్రానైట్ ఫ్యాక్టరీలలో దాడులు చేసేందుకు వచ్చిన అధికారులను నిలదీయడం ఆయన చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఒక ప్రజాప్రతినిధిగా ప్రశ్నించే హక్కు ఉందన్నారు. శాంతియుత పద్ధతిలో అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే పై రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఒక విద్యావంతుడుగా ఉద్యోగిగా సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా చంద్రబాబు సన్నిహితుడిగా పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఏలూరి రాజకీయంగా ఎదుర్కోలేక రౌడీ మూకలు నేరచరిత్ర కలిగిన వ్యక్తులతో కుట్రలకు పాల్పడ్డారన్నారు. దీనికి సీఎం జగన్మోహన్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే ఏలూరిపై కుట్రలకు ఆజ్యం పోసారని ప్రజల ఆశీస్సులు ఉన్నంతకాలం ఎమ్మెల్యే ఏలూరిని ఎవరు ఏమి చేయలేరన్నారు. ఏలూరి అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఏలూరి ఎదుగుదలను అడ్డుకోవడం అసాధ్యం అన్నారు. కేసులకు భయపడేది లేదన్నారు. అక్రమ కేసులు బనాయించిన అధికారులు క్షమాపణలు చెప్పి కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి అధికారి రానున్న రోజుల్లో సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. అత్యుత్సాహం ప్రదర్శించి అబాసపాలు చేయాలని చూసినా అధికారులకు కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. న్యాయం గెలుస్తుందన్నారు. నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు,గుదే తారక రామారావు,రావిపాటి సీతయ్య, కొరటాల వంశీకృష్ణకోయ సతీష్, వజ్జ సుబ్బరామయ్య, కర్లపూడి నారాయణస్వామి,సింగ్ చంద్రశేఖర్, ఈరపనేని వాసు,సూరిశెట్టి శ్రీనివాసరావు షేక్ బాజీ రాయుడు,సూరిశెట్టి సతీష్ ఈదల అనిల్ కుమార్,నిమ్మల సాంబశివరావు,పెరవల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే కుట్రలు..

విశాలాంధ్ర-పర్చూరు: నియోజకవర్గంలో ప్రశాంతంగా ఉండగా అలజడులు, అరాచకాలు సృష్టించినా అంతిమ విజయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుదే అని బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జమాలుద్దీన్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజాదరణ కలిగిన ఏలూరిని రాజకీయంగా ఎదుర్కొనలేక వైసీపీ ప్రభుత్వ పెద్దలు కుట్రలకు పాల్పడుతున్నారని, గ్రామాలలో అలజడులు సృష్టిస్తున్నారని తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, మైనార్టీ నాయకులు హుస్సేన్, రఫీ, గౌస్, మస్తాన్‌వలి, ఫారూఖ్, సుభాని, అక్రమ్, మౌలాలి, రెహమాన్, కరీముల్లా, అల్తాఫ్, మహ్మద్ ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కురిచేడులో మన ఊరికి మన శివన్న..

విశాలాంధ్ర-కురిచేడు : మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం కురిచేడులో ఎన్నికల ప్రచారం ప్రకాశం జిల్లా జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యులు ప్రస్తుత దర్శి ఇన్చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని జడ్పీటిసి నుసుం వెంకట నాగిరెడ్డి సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. స్థానిక హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తూర్పు దళితవాడకు వెళ్లే రహదారికి ఐదు లక్షల రూపాయలు జడ్పీ నిధులతో సిసి రోడ్లు పనులు శంకుస్థాపన చేస్తారని తదుపరి పడమడ దళితపాలెంలో ప్రజలతో మాట్లాడతారని, క్రిస్టియన్ పాలెంలో ఐదు లక్షల రూపాయలు జడ్పీ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని,10 లక్షల రూపాయలతో అంతర్గత పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని వాల్మీకి బజారులో 10 లక్షల రూపాయలతో సైడ్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన ఈరన్న స్వామి దేవాలయం వద్ద వాల్మీకి సోదరులతో సమావేశం నిర్వహిస్తారని 15 లక్షల రూపాయల నిధులతో ముస్లిం ఈద్గాకు ప్లాట్ ఫామ్ , ప్రహరీ నిర్మాణం ప్రారంభోత్సవంలో పాల్గొంటారని వివరించారు.

సామాజిక ఆరోగ్య నూతన భవనం ప్రారంభం నేడు

విశాలాంధ్ర - వేమూరు : నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో రూ.8.6 కోట్లతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హరిణి తెలియజేశారు. ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మెరుగు నాగార్జున,వైద్యారోగ్యశాఖ మంత్రి విడుదల రజిని, జిల్లా ఇన్చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరవుతారని ఆమె వివరించారు. గతంలో నిర్మించిన భవనంలో 30 పడకలు చాలకపోవడంతో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు

విశాలాంధ్ర-శింగరాయకొండ : స్థానిక పీఎన్‌సీఏ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ గీతారాణి మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివి విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న కొంతమంది జీవిత నేపథ్యాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో అలరించాయి.

టీడీపీ సీనియర్ నేత వెంకటశేషయ్య మృతి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని పేర్నమిట్ట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు దగ్గుపాటి వెంకట శేషయ్య (73) తన నివాసం వద్ద సోమవారం మృతి చెందారు. ఎస్ ఎన్ పాడు ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే బి. ఎన్ .విజయ్ కుమార్, ఎస్ఎన్ పాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేత సిరిపురం రుద్రయ్య, వివరం గోవింద్ కరిచేటి శ్రీనివాసరావు ఈదర విష్ణు ఆముదాల శ్రీను సీపీఎం నేత ఎస్కే మాబు, బంకా సుబ్బారావు నివాళులర్పించారు.

ఆశీర్వదించి గెలిపించండి

విశాలాంధ్ర-దర్శి : దర్శి వైసీపీ ఇంచార్జ్ డాక్టర్ బుచేపల్లి శివప్రసాదరెడ్డి మన ఊరు మన శివన్న కార్యక్ర మాన్ని నగర పంచాయతీ పరిధిలోని 1వార్డులో సోమవారం నిర్వహించారు. తొలుత స్థానిక అయ్యప్ప స్వామి దవస్థానంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మీ బిడ్డగా అందరించి వచ్చే ఎన్నికల్లో అందరించి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 2024 నుంచి దర్శి నియోజకవర్గంలో ప్రజలకు సేవలం దించామని ప్రజా సేవకే అంకితమైన మా కుటుంబాన్ని అందరించి నా బిడ్డని గెలిపించాలని అన్నారు. ఎన్నికల ప్రచారంలో హెూటల్‌లో దోశలు పోసి అందరిని అచ్చర్యపరిచారు. ప్రచారం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో సోము దుర్గారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వేమిరెడ్డి చెన్నారెడ్డి, ఒకటవ వార్డు కౌన్సిలర్ బాబు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కరణంతో డేవిడ్ మనోహర్ భేటీ

విశాలాంధ్ర - చీరాల : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న ఆశయాలను బలపరుస్తూ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని క్రిస్టియన్ మైనారిటీ జోనల్ చైర్మన్ పట్టెం డేవిడ్ మనోహర్ అన్నారు.సోమవారం వైస్సార్సీపి చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌ను పట్టెం డేవిడ్ మనోహర్ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డేవిడ్ మనోహర్ మాట్లాడుతూ ఇంటింటికి ప్రభుత్వాన్ని తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని, జగనన్న ఆశయాలను చిత్తశుద్ధితో ముందుకు తీసుకెళ్లే కరణం వెంకటేష్ గెలుపు కోసం క్రిస్టియన్ మైనారిటీ కృషి చేస్తుందన్నారు. కరణం వెంకటేష్ అధ్యక్షతన చీరాల నియోజకవర్గ దైవ సేవకులు, క్రైస్తవ నాయకుల సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో దైవ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంకటేష్ దృష్టికి తీసుకుని వెళ్లగా త్వరలో పరిష్కరిస్తానని కరణం వెంకటేష్ హామీ ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పాస్టర్లు వైఎస్ఆర్‌సీపీకి కరణం వెంకటేష్‌కు అండదండలుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ విభాగం బాపట్ల జోనల్ కార్యాలయం సిబ్బంది, కీర్తి వెంకట్రావు,బండికళ్ళ నరేష్,కారంకి విలియమ్,పేర్లీ నాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్‌గా ప్రభాకరరావు

విశాలాంధ్ర - చీరాల : ఆదివారం బాపట్ల లో జరిగిన ఎస్టీయు జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్‌గా చీరాల పట్టణానికి చెందిన సైన్స్ టీచర్ వంకా ప్రభాకరరావు,ఎస్టీయు జిల్లా ఉపాధ్యక్షులుగా చీరాల మండలానికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ ఏం.ఏసురత్నంని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఇరువురి నియామకం పట్ల చీరాల ఎస్టీయు నాయకులు రమణరావు, రమేష్,రాజ్ కుమార్,జివి సుబ్బారెడ్డి, ఆదిశేషు,భానుచంద్రమూర్తి, శివ వరప్రసాద్,టి వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వంక ప్రభాకరరావు,ఏసురత్నంలు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు.

ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదుర్కోవాలి : కొండయ్య

విశాలాంధ్ర - చీరాల : ప్రతిపక్ష పార్టీలను రాజకీయంగా ఎదుర్కోవాలని, అధికారం ఉందని పోలీసులతో వేధిస్తే ప్రజలు రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తారని చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి మద్దులూరి మాల కొండయ్య అన్నారు. టీడీపీ శాసనసభ్యులకు మద్దతుగా టీడీపీ నాయకుల చలో అసెంబ్లీ కార్యక్రమానికి పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో టీడీపీ నాయకులను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకొని, మరి కొంత మందికి ఇంటి వద్దనే ముందస్తు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు చట్టానికి లోబడి పనిచేయాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల నలో ప్రతిపక్ష పార్టీలపై రోజు రోజుకు పోలీసుల వేధిం పులు ఎక్కువయ్యాయన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే టీడీపీ శాసనసభ్యులకు అండగా వెళ్లాలని భావించి అందుకు అనుగుణంగా పిలుపు ఇస్తే అర్ధరాత్రి సమయంలో పార్టీ నాయకులను స్టేషన్‌కు తీసుకురా వడం జగన్మోహన్ రెడ్డి మొండి వైఖరికి నిదర్శనమ న్నారు. మహిళా నాయకుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారని చట్టానికి లోబడి నిరసన తెలపాలనుకుంటే, ఉగ్రవాదులు,నక్సలైట్లు తీవ్రవాదుల మాదిరి అక్రమ అరెస్టులు, నోటీసులు ఇవ్వడం ఏమిటన్నారు. రాబో యేది టీడీపీ ప్రభుత్వమని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పోలీసు అధికారులపై టీడీపీ ప్రభుత్వంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొండయ్య పోలీసులతో మాట్లాడి తన సొంత పూచి కత్తుపై టీడీపీ నాయకులను విడిపించారు. పార్టీ పట్టణా ధ్యక్షులు గజవల్లి శ్రీను,కొండ్రు రత్నబాబు, నరాల తిరుపతి రాయుడు,దేటా నాగేశ్వర రావు,మోహన్ గౌడ్,బోయిన శ్రీను,సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మండల కన్వీనర్ సూరవరం గండి వీరారెడ్డి తెలిపారు. మండలంలోని. స్థానిక శివ సదన్‌లో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9,10,11 తేదీలలో ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఒంగోలు జిల్లా బిజెపి అధ్యక్షుడు పివి శివారెడ్డి సూచనల మేరకు మండలం లోని మండల బిజెపి అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి ఆధ్వర్యంలో, మండల కన్వీనర్‌గా అల్లంపూరి శ్రీను కో కన్వీనర్ వెన్న లక్ష్మిరెడ్డి మండలంలో ప్రతి బూతులో ప్రజలందరినీ కలిసి ఉండాలి. ఈ కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ ఎనుమల నాగేశ్వరావు మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో పేదల సంక్షేమం మహిళా సాధికారత దేశ భద్రత సంస్కృతి భారతదేశ గొప్పతనాన్ని ప్రజలకు వివరించి చెప్పాలని, రాబోయే ఎన్నికల్లో మీరందరూ కూడా బిజెపి ప్రభుత్వాన్ని కేంద్రంలో రాష్ట్రంలో మీ సహాయక సాకారాలు అందించాలని, ప్రజలకు తెలియజేయాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎస్సీ మోర్చా అధ్యక్షులు సమూయేలు కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు సత్వరం పరిష్కరించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర - రేపల్లె : స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆర్డీవో హేల షారోన్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో పాల్గొన్న అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా 9 అర్జీలు అందాయని తెలిపారు. రేపల్లె పట్టణంలో వంద పడకలతో ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చెయ్యాలని కోరుతూ పట్టణాభివృద్ధి సంఘం నాయకులు సివి మోహన్‌రావు కోరినట్లు తెలిపారు. మండలం బేతపూడి గ్రామానికి సంబంధించి 2022 మండుస్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం మంజూరు చేయాలని వినతి,భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి సంబంధించి డెత్ సర్టిఫికేట్ మంజూరు చేయాలని కోరుతూ ఒక అర్జీ, రేపల్లె మండలం పోటు మరక గ్రామానికి సంబంధించి అడంగల్ నందు కరెక్షన్స్ చేయాలని కోరుతూ మూడు అర్జీలు అందాయన్నారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి సంబంధించి రిసర్వే నందు మనభూమి సరి చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ, మున్సిపాలిటీ నందు గవర్నమెంట్ ల్యాండ్ ఆక్రమణ గురించి ఒక అర్జీ, రేపల్లె మున్సిపాలిటీ నందు హౌసింగ్ స్కీమ్ కింద ఇంటి నిర్మాణం మంజూరు కోరుతూ ఒక అర్జీ, నిజాంపట్నం మండలం ప్రెజ్జం గ్రామం నందు గవర్నమెంట్ ల్యాండ్ ఆక్రమణ గురించి ఒక అర్జీ రేపల్లె మండలం లంకెవాని దిబ్బ గ్రామంలో తమ పొలాలకు బండి దారి కల్పించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖ చట్టాలను పరిరక్షించాలి



విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న చట్టాలను పరిరక్షించాలని, ఈ చట్టాలను నిర్వీర్యం చేస్తున్న జిల్లా వైద్యాధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం స్పందనలో అంబే ద్కర్ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొచ్చెర్ల వినయ్‌రాజు, అధ్యక్షులు గుదె రాజారావు జిల్లా జాయిం ట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కి వినతి పత్రాన్ని అందజే శారు. వారు మాట్లాడుతూ ఏపీఎంసీఈ చట్టం 07/2022 ప్రకారం సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రకారం హాస్పటల్లో ఉన్న క్లినికల్ లేబరేటరీ, డయాగ్నోస్టిక్ సెంటర్స్,రక్త పరీక్షలు చేసిన తర్వాత కచ్చితంగా రిపోర్టు మీద అర్హత కలిగిన పెథాలజిస్ట్ సంతకం ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతలు, పర్యవేక్షణ చేయవలసిన జిల్లా వైద్యశాఖాధికారిపై ఉందన్నారు. జిల్లా వైద్యాధికారి చట్టాన్ని అమలు చేయడంలో, పర్యవేక్షణ చేయటంలో పూర్తిగా జిల్లా వైద్యాధికారి విఫలమయ్యారని వీటిని అమలుపరచకుండా గాలికి వదిలేసారన్నారు.

భావపురి బ్రాహ్మణ సమాఖ్య సమావేశం

విశాలాంధ్ర - బాపట్ల : భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని అశోక కన్వెన్షన్ హాల్‌లో అధ్యక్షులు శ్రీహరి ప్రకాష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. విశిష్ట అతిథిగా శాసనసభ్యులు కోన రఘుపతి హాజరయ్యారు. ఈ సమావేశంలో సుమారు కోటి రూపాయలతో ఆరామ క్షేత్ర భవన నిర్మాణానికి కమిటీ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విరివిగా అభివృద్ధి కొరకు చందాలను ప్రకటించారన్నారు. కోనా రఘుపతి ద్వారా వచ్చిన ఫండ్స్ నుంచి సుమారు పదిమందికి ఒక్కొక్కరికి లక్ష చొప్పున జగన్మోహన్ రెడ్డి కాలనీలో గృహాలను నిర్మించుకున్న వారికి మిగిలి విడత పనులు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకొనుటకు వీలుగా చెక్కుల రూపంలో వారికి నగదు అందజేశారన్నారు. సంక్రాంతి లక్ష్మి కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమరాజు శ్రీనివాస్,నారాయణ,మోహన శ్రీనివాసు, రాఘవస్వామి శ్రీకాంత్,కోదండ రామారావు, హరినాథ్ శర్మ , గూడ వెంకట భట్టు మిగిలిన కార్యవర్గ సభ్యులు బ్రాహ్మణ కుటుంబీకులు పాల్గొన్నారు.

బాధితులకు రెడ్ క్రాస్ సాయం

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణం లోని 13వ వార్డులో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన 5 యానాది కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ సహకారంతో,సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం వంట సామాగ్రి, నాణ్యత కలిగిన టార్పాలిన్ పట్టా హైజిన్ కిట్లును అందజేసినట్లు రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాలవ కట్టలపైన నివసిస్తున్న అత్యంత నిరుపేదలైన యానాది కుటుంబాల వారు ఈ అగ్ని ప్రమాద బారినపడటం చాలా దురదృష్టకరమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా విపత్తుల నిర్వహణ కమిటీ కన్వీనర్ అడుసుమల్లి ప్రభాకర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు వారికి తమ అంతర్జాతీయ సేవా సంస్థ రెడ్ క్రాస్ ఎల్లప్పుడూ అండదండలు అందజేస్తూ చేయూతను ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల యానాది మహనాడు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం సిఫార్సు స్వచ్ఛంద సేవా సంస్థ రేపల్లె నగరం మండల కో-ఆర్డినేటర్లు పెట్ల ,జ్యోతి,కొమరగిరి నాగేశ్వరరావు, స్థానిక ప్రజలు,నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

విశాలాంధ్ర-పర్చూరు: ప్రకృతి వ్యవసాయ ద్వారా పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారని తహశీల్దార్ కె.సంధ్యశ్రీ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు చేశారు. రైతులు, అధికారులు కూరగాయలను కొనుగోలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పంటలను పండించుటకు రైతులు ఆసక్తి చూపాలని, తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. డీటీ నాగలక్ష్మీ, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఎస్ఓ శీమన్నారాయణ, మాస్టర్ ట్రైనర్ సిహెచ్ అప్పారావు, మోడల్ మేకర్ జి.పద్మజ, యూనిట్ ఇన్‌చార్జ్లు అంకారావు, శ్రీనివాసరావు, తిరుపతమ్మ, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నాయకులకు నోటీసులు

విశాలాంధ్ర-పర్చూరు: పంచాయతీరాజ్ సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు శాసనసభను ముట్టడిస్తామని ప్రకటించటంతో... వారికి మద్దతు తెలపాలని టీడీపీ నిర్ణయం తీసుకోవటంతో టీడీపీ నాయకులకు, సర్పంచ్‌లకు పోలీసులు నోటీసులు జారీచేశారు. ప్రజాస్వామ్యయుతంగా పాలన ఉండాలని టీడీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, రాష్ట్ర బీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోదూరి శేషబ్రహ్మాచారి, సర్పంచ్ దాసి ఉషారాణి తదితరులు ఉన్నారు.

సీఐ, ఎస్ఐని కలిసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-కొమరోలు : పోలీస్ స్టేషన్‌లో గిద్దలూరు నూతన సీఐ దాసరి ప్రసాద్, ఎస్ఐ కె.వెంకట కోటేశ్వరరావును స్థానిక జడ్పీటీసీ సారె.వెంకట నాయుడు, నాదెళ్ల. వెంగయ్య చౌదరి, మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్.నన్ను ఎంపీటీసీలు నాగదాసరి తిరుపతిరాజు, షేక్.సుబాన్, కొమరోలు మండల వైఎస్ఆర్సిపి నాయకులు మండల జేసిఎస్ వి.మోహన్‌రెడ్డి, చేదుళ్ల రమణారెడ్డి, ఏలూరి రమణయ్య, గోల్కొండ అబ్దుల్ సుబాన్, లక్కమానేని తిరుమలయ్య, దసరి.లక్ష్మి నరసయ్య, వైస్సార్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ సందర్శించిన సీఐ

విశాలాంధ్ర- కొమరోలు : కొమరోలు పోలీస్ స్టేషన్‌ను సోమవారం సర్కిల్ రూరల్ సీఐ దాసరి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐ కోటేశ్వరరావుకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ దాసరి ప్రసాద్ మాట్లాడుతూ గిద్దలూరు సర్కిల్ పరిధిలోని మూడు మండలాలలో ట్రాఫిక్ నియంత్రించేందుకు తమ వంతుగా చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చూస్తామన్నారు.

ఎస్ఐ మాధవరావు బాధ్యతలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కే మాధవరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన కనిగిరి స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి రాగా ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన బ్రహ్మనాయుడు నాగులుప్పలపాడు మండల ఎస్సైగా బదిలీ అయ్యారు.

నేడు వైఎస్సార్ ఆసరా ప్రారంభం

విశాలాంధ్ర-వెలిగండ్ల: వైయస్సార్ ఆసరా కార్యక్రమాన్ని కనిగిరి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ చేతుల మీదుగా మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఎంపీడీవో ప్రాంగణంలో ప్రారంభిస్తారని వెలుగు ఏపీఎం ఎం. లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 520 గ్రూపులకు గాను 5167 మంది సభ్యులకు నాలుగు కోట్ల ఇరవై ఒక్క లక్ష 64 వేల రూపాయలు అందించడం జరుగుతుందని మండలంలోని ఎంపీటీసీ, సర్పంచులు, వైసిపి శ్రేణులు పాల్గొని పై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-అద్దంకి : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై మాటల దాడి విష ప్రచారాన్ని ఆపివేయాలని, ఆమెపై సోషల్ మీడియాలో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జెడి.శీలం అన్నారు. సోమవారం స్థానిక రహదారుల అతిథి గృహంలో అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సమన్వయ సమితి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ షర్మిలపై విష ప్రచారానికి పాల్పడిన దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. షర్మిల వచ్చాక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వచ్చిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. పార్టీ అవ కాశం ఇస్తే వచ్చే ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో బాపట్ల పార్లమెంట్ పరిధిలో పలు గ్రామాలలో మంచినీటి సౌకర్యం, ఆర్వో ప్లాంట్లను కల్పించినట్లు తెలిపారు. గడచిన పదేళ్లలో టీడీపీ,వైసీపీ ఎంపీలు ఎవ్వరు కూడా ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు కాంగ్రెస్ తరపున పార్లమెంట్‌లో పోరాడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సమర్ధులను ఎన్నుకోవాలన్నారు. ఈనెల 7న బాపట్లలో వైఎస్ షర్మిల రోడ్ షో, బహిరంగ సభ ఉంటుందన్నారు. రోడ్ షోకు అద్దంకి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొరె సురేంద్ర, యర్రమోతు నాగయ్య, సురేష్, సుబ్బారెడ్డి, అబ్రహం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బల్లికురవ : టీడీపీ గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొప్పెరపాడు గ్రామానికి చెందిన వైకాపా శ్రేణులు యర్రా కోటేశ్వరరావు, గుంజి జీవరత్నం, బొంతా మరియబాబు, బొంతు రామయ్య, బొంతు చిన్నబొంతా యర్రయ్య తదితరులు సంతమాగులూరు అడ్డరోడ్డులోని ఎమ్మెల్యే అతిథి గృహంలో గొట్టిపాటిని కలిసి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన సంకల్పంతో చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుడితే జగన్ రెడ్డి నిర్వీర్యం చేశాడన్నారు. పింఛన్ల చెల్లింపు ఇళ్లపట్టాలు,ఇంటి నిర్మాణం, ఆసరా,అమ్మఒడి సహా అన్నింట్లోనూ మహిళలను మోసం చేశాడన్నారు. చంద్రబాబు కోటిమంది డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికీ 20 వేలు అందిస్తే జగన్ రెడ్డి ఇప్పటివరకు 15 వేలు మాత్రమే ఇచ్చాడన్నారు. కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో కేవలం 79 లక్షల మందికే ఆసరా సాయం అందించాడన్నారు. జగన్ చేసిన అప్పులు 13 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 10 లక్షల కోట్లు మొత్తం 23 లక్షల కోట్ల సొమ్ములో మహిళలకు ఇచ్చిన సొమ్మెంతో జగన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. 23 లక్షల కోట్లలో జగన్ రెడ్డి బటన్ నొక్కుడుతో పేదలకు ఇచ్చింది 2.48 లక్షల కోట్లు అయితే,మిగిలిన సొమ్ము బెంగుళూరు ప్యాలెస్‌కు పోయిందా అని ధ్వజమెత్తారు. విడతలవారీగా పింఛన్లు పెంచుతానని చెప్పి ఐదేళ్లలో ఒక్కో లబ్ధిదారుడికి 30 వేలు ఎగ్గొట్టాడన్నది వాస్తవం కాదా అన్నారు.జగన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో పెంచిన పింఛన్ లబ్దిదారుల సంఖ్య కేవలం 7 లక్షలు మాత్రమేనని చంద్రబాబు ఐదేళ్లలో 22 లక్షల మందికి అదనంగా పింఛన్లు ఇచ్చారన్నారు. వృద్ధులు, వితంతువులు,వికలాంగులు,చర్మకారులు, డప్పుకళాకారులు,ఒంటరి మహిళలు,హిజ్రాలకు కూడా చంద్రబాబు పింఛన్లు అందించి ప్రతి ఒక్కరికి అండదండగా నిలిచారన్నారు.

ప్రజాభిమానం తట్టుకోలేకే తప్పడు కథనాలు: టీడీపీ

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీలో నాయకుల ఐక్యత పార్టీకి ఉన్న ప్రజాభిమానం తట్టుకోలేక ఓ పత్రికను అడ్డుపెట్టుకుని కుల రాజకీయాలకు తెరలేపిందని తెలు గుదేశం పార్టీ గౌరవ అధ్యక్షులు తోట నారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తోట నారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ యాదవ సామాజిక వర్గాన్ని, ఎస్సీ సామాజిక వర్గాన్ని టీడీపీ నిర్లక్ష్యం చేసిందని ఈ వర్గాలపై భౌతిక దాడులు చేసిందని చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మా మధ్య ఎటువంటి బేధాభిప్రాయాలు లేవని ఎవ్వరు కూడా ఒకరి మీద ఒకరు దాడి చేసుకోలేదన్నారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయబాబు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీ ప్రభంజనం తట్టుకోలేని వైసీపీ కులాల మధ్య కుంపట్లు పెట్టి చోద్యం చూస్తున్న వైసిపి నాయకుల పనికిమాలిన ప్రయత్నాన్ని గర్హిస్తున్నామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మీ పార్టీ విధానాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. సమాజంలోని అన్ని కులాలను రాజ్యాంగ దిశగా తీసుకువెళ్లిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. బలహీన వర్గాలకు ఎస్సి,ఎస్టి మైనార్టీ వర్గాలకు సమాజంలో సముచిత స్థానం కల్పించి అనేక పథకాలను ప్రవేశ పెట్టి ఎస్సిలను ఆర్ధికంగా రాజకీయంగా చైతన్య వంతులుగా తీర్చిదిద్దిన పార్టీ తెలుగుదేశం అన్నారు. బాపట్ల నియోజకవర్గములో వేగేశన నరేంద్ర వర్మ నాయకత్వంలో బలహీన వర్గాలు, ఎస్సి,ఎస్టి మైనార్టీ వర్గాలు సమాజంలోని అని సామాజిక వర్గాలు ప్రగతి పథంలో పయనిస్తుంటే ఓర్చుకోలేక చంద్రబాబు పట్ల నరేంద్ర వర్మ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి బెదిరిపోయి ఓటమి తప్పదన్న భావన తో చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.తగిన రీతిలో మీకు బుద్ది చెప్పి ఈ రాష్ట్రం నుండి వైసీపీని గద్దె దింపడమే లక్ష్యంగా ప్రజానీకం పనిచేస్తున్నారన్నారు. నాయకులు నక్కల వీర రాఘవయ్య,నక్కల వెంకట స్వామి, వడ్లమూడి వెంకటేశ్వర్లు,బడుగు నాగేశ్వరరావు, కూచిపూడి శ్యాంసుందర్, హనుమాన్ జి,బాల కోటేశ్వరరావు,హరిబాబు, బడుగు యోహాన్ పాల్గొన్నారు.

కళాకృతుల ప్రదర్శనకు అంగళ్ళు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - చీరాల : పంచవృత్తిదారులు తయారు చేసిన వస్తువులను కళాకృతులను ప్రదర్శించేందుకు, జిల్లా స్థాయిలో అమ్మకపు అంగళ్ళు ఏర్పాటు చేయాలని పంచవృత్తిదారుల సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పంచవృత్తిదారుల వస్తువుల ప్రదర్శన అమ్మకానికి జిల్లా స్థాయిలో అంగళ్ళు ఏర్పాటు చేయాలని చీరాల మండల తహశీల్దార్ కె.నాసరయ్యకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కమ్మరం, వడ్రంగం,కంచరి,శిల్పి,స్వర్ణ కారు వృత్తులలో 50 సంవత్సరాలు దాటిన అర్హులైన వృత్తిదారులకు పెన్షన్ నెలకు రూ.7000 ఇవ్వాలని, వృత్తులు,వృత్తిదారుల సంక్షేమం కాపాడుటకు పరిస్థితులు అధ్యయనం చేయటానికి నిపుణులతో కూడిన కమిటీ వేయాలన్నారు. సహజమైన ఆహారం,పాలు,నీరు,వంట నూనెలు, వెన్న, నెయ్యి, భవిష్యత్తు తరాలకు అందించాలంటే ఆయా రంగాల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నిపుణులతో కూడిన కమిటీ వేయాలన్నారు. చీరాల పట్టణ కమిటీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు,సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం పట్టణ కార్యదర్శి ఎ.రామారావు,మంకెన యోహాను, చింతా నరసింహారావు, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

తహశీల్దార్ నాగరాజు బాధ్యతలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల తహశీల్దార్‌గా వై.నాగరాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.నెల్లూరు జిల్లా సంగం మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న అయన సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై నిజాంపట్నంకు వచ్చారు.ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె.నెహ్రూ బాబు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ వై.నాగరాజు మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అలాగే రెవిన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.నూతన బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌ను డీటీ జేమ్స్ పాల్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తే నిందలా

విశాలాంధ్ర - బాపట్ల: ప్రజల కోసం ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం జిల్లాలో ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ముందుండి అన్యాయాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో కొంతమంది మా తోటి నాయకులు సామాజిక మాధ్యమాల్లో అడ్డుకోవడం బాధాకరమని అఖిల భారత దళిత గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య అన్నారు. బాపట్లలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మా వంతుగా మేము పని చేసుకుంటూ పోతున్నామే గానీ ఏనాడు మీరు చేసే కార్యక్రమాల్లో అడ్డుపడలేదన్నారు. తప్పు చేస్తున్న అధికారులపై మా పోరాటం ఉంటుందని మా దగ్గర ఉన్న పూర్తి ఆధారాలు అధికారులకు చూపిస్తామని తెలిపారు. ప్రజలందరూ మీరు చేసే వ్యాఖ్యల్ని మీ కార్యకలాపాలని ప్రతినిత్యం గమనిస్తూనే ఉన్నారని తగిన మూల్యం త్వరలో చెల్లించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ గుదే రాజారావు, ఉపాధ్యక్షులు కొచ్చెర్ల వినయ్‌రాజు తదితరులున్నారు.

టీడీపీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు

విస్తృతస్థాయి సమావేశంలో ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎవరు అపోహలకు గురికావద్దని టిడిపి కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సూచనలు ప్రతి నాయకుడు కార్యకర్త అనుసరించాలని, కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోకుండా నిమ్స్ అభివృద్ధి చేస్తామని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అంకితంచేసి అభివృద్ధికి దోహదం చేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిరుద్యోగులు ఉపాధి కోసం ఫార్మ కంపెనీ చంద్రబాబు ఇక్కడే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు రైల్వే లైను పోర్టులో అనుసంధానం ఇక్కడ నుండి జరుగుతుందని అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు ఉంటాయని ఎవరు అధైర్య పడవద్దు అని 2019లో గెలిచిన వైఎస్ఆర్ పార్టీ సర్పంచ్ ఎంపీటీసీ పదవులకు నామినేషన్లు జరిగాయని తెలుగుదేశం అధికారంలోకి వస్తే నామినేషన్లు కూడా ఉండవని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో 35 నుండి 40 వేల వరకు మెజారిటీతో గెలుస్తామని తెలిపారు.

ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి యద్దనపూడి సల్మాన్ రాజ్ మాట్లాడుతూ ఎస్సీలలో క్రిస్టియన్లు వైయస్సార్ పార్టీకి ఓటు బ్యాంకుగా ఉన్నారని గ్రామాలలో ఉన్న ఎస్సీలకు అవగాహన కల్పించడం జరిగిందని వారు 2024లో టిడిపికి ఓటు వేస్తామని తెలిపారు అన్నారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గౌడకట్ల హరికృష్ణ మాట్లాడుతూ, కష్టపడి తెలుగుదేశం పార్టీని ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ మాట్లాడుతూ, కుల మతాలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ క్లస్టర్ ఇన్చార్జ్ దొడ్డ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను అన్యాయం చేసింది జగన్మోహన్‌రెడ్డిని 2024లో ప్రజలు గద్దె దింపుతారని కార్యకర్తలు పని చేయాలని సూచించారు. మాజీ మండల అధ్యక్షులు శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ విభేదాలు పక్కన పెట్టి కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.

ఉగ్ర పుట్టినరోజు వేడుకలు..

డాక్టర్ ముక్కు ఉగ్ర సింహారెడ్డి పుట్టినరోజు వేడుకలను పార్టీ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, చిలకల కృష్ణారెడ్డి, కొండు విజయభాస్కర్ రెడ్డి, బాల నారాయణ గంజి రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి, వెన్న రమణారెడ్డి, బొబ్బా భూపాల్, చందా బాలకాశిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన వెంకటయ్య మోటాటి సుబ్బారెడ్డి, కీసర రమణారెడ్డి పాల్గొన్నారు.

ముండ్లమూరు తహసీల్దార్‌గా మధుబాబు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరు మండల తహసీల్దార్‌గా జె మధుబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన మహమ్మద్ నయన్ అహమ్మద్ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండల తహసీల్దార్ గా పనిచేస్తున్న జె మధుబాబు బదిలీపై ముండ్లమూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయన ను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో ల్యాండ్ రిసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎ ప్రవంతి, డిప్యూటీ తహసీల్దార్ జి పుల్లారెడ్డి. రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరిరావు, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ కృష్ణ ప్రసాద్, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ దేవకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

40 మంది రక్తదానం

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగుల కోసమై స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో పలువురు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది సుమారుగా 40 మంది రక్తదానం చేయడం జరిగింది. గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మరణాలకు రెండవ ప్రధాన కారణం క్యాన్సర్ అని, ప్రతి సంవత్సరం 10 మిలియన్ల మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారని తెలిపారు. రొటీన్ స్క్రీనింగ్ మరియు ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా క్యాన్సర్‌కు సంబంధించిన మొత్తం మరణాలలో దాదాపు మూడింట ఒక వంతు అరికట్టవచ్చు అని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చాలామంది క్యాన్సర్ రోగులు రక్తహీనత, ప్లేట్లెట్స్ తక్కువ కావడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని ఇటువంటి వారికి ఆరోగ్యకరమైన రక్తదాతల సహాయం ఎంతో అవసరం అని తెలిపారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు అపోహల గురించి అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు.

ఇంటి వద్దకే వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు

విశాలాంధ్ర-శింగరాయకొండ : ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా సోమవారం శానంపూడి, కలికవాయి, కనమళ్ల గ్రామాల్లో వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులను లబ్దిదారులకు వారి ఇంటివద్దకు వెళ్లి ఆరోగ్య కార్యకర్త వలంటీర్ల ద్వారా అందజేసినట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలి తెలిపారు. రూ.25 లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పించిందని తెలిపారు అరుణ్‌జ్యోతి, కళ్యాణి, సాయిశ్రీ, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల అండదండలు కావాలి: సీపీఎం

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రజల కోసం పోరాడే సీపీఎం కు అండదండలు ఇవ్వాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు అన్నారు. సీపీఎం ప్రజానిధి కాంపెయిన్ లో భాగంగా ఆది, సోమవారాలలో కె.వి. పాలెం,చీమకుర్తి, నిప్పట్లపాడు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. వెంకటరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో అంగన్వాడీ, మునిసిపల్, ఆషాలు ఇతర కార్మికుల పోరాటాలు నడిచినపుడు వారికి అండగా నిలిచినది సీపీఎం అన్నారు. గతంలో ఇళ్లస్థలాలు, పట్టాల కోసం పోరాడి విజయం సాధించినది అన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కోసం పోరాడుతున్నది సీపీఎం అన్నారు. సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు, మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిస్టిపాటి చిన్నపరెడ్డి, బెజవాడ శ్రీను కొల్లూరి వెంకటేశ్వర్లు,శీలం ఆదినారాయణ,బొడ్డు ఓబులేసు,పులి ఓబులరెడ్డి,చిట్టేల కొండయ్య,దరిసి సుధాకర్,నల్లూరి కృష్ణయ్య,మాదాల నరసింహారావు, రావూరి వెంకటరావు, నుగ్గు శ్రీను,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

25 తులాల బంగారం, రూ.54 వేలు చోరీ

విశాలాంధ్ర-కనిగిరి : కొత్తూరులో తాళంవేసిన ఇంటిలో చోరీ జరిగింది. 25 తులాల బంగారం, 54 వేల నగదుతో పాటు పాన్ కార్డులు, ఏటీఎం కార్డులు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కొత్తూరులో నివాసముంటున్న రామణ భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో స్వగ్రామమైన వెలిగండ్ల మండలం కొట్టాలపల్లికి ఆదివారం వెళ్లటం జరిగింది. సోమవారం ఉదయాన్నే కనిగిరిలోని ఇంటికి రాగా తలుపులు, బీరువా తాళాలు పగలగొట్టి ఇంట్లోనే వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో బాధితుడు కనిగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సీఐ దాసరి వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరువీధి త్యాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రల సేకరణకు ప్రత్యేక బృందాన్ని రప్పించి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర-చీమకుర్తి : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బండ్లమూడి గ్రామానికి చెందిన ఆవులమంద శ్రీనివాసులు, చీమకుర్తికి చెందిన కోటి ఇద్దరు కలిసి కేబుల్ ఆపరేటర్ పనులు నిమిత్తం మోటార్ సైకిల్ పై పల్లమల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా, పల్లామల్లి దగ్గర కోళ్ల ఫారం కాలువ కట్ట సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. బాధితుల్లో ఒకరు తన తమ్ముడు వెంకట్రావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బాధితులను స్థానికులు చీమకుర్తి గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. బాధితుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-కనిగిరి : మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి, సహాయకుల ఉద్యోగాలకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. కనిగిరి ప్రాజెక్టులోని మూడు అంగన్వాడి, 10 ఆయాల, ఒకటి మినీ అంగన్వాడి ఉద్యోగాలతో పాటు వెలిగండ్ల ప్రాజెక్టులోని రెండు పోస్టులు, పొదిలి ప్రాజెక్టులోని ఒక పోస్టు ఉద్యోగాలకు 57 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను నిర్ధారించి అంగన్వాడి సూపర్వైజర్లు ఆర్డీవో కార్యాలయానికి ఇంటర్వ్యూకి పంపారు. కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, ఐసిడిఎస్ పిడి కే మాధురి, కమ్యూనిటీ వైద్యశాల సూపర్నెంట్ అబ్దుల్ కలాం, కనిగిరి సిడిపిఓ పి. సరోజిని, పొదిలి సిడిపిఓ సుధా మారుతి, సూపర్వైజర్లు ఎంవీఎస్ పార్వతి, జి పద్మజ, షేక్ జరీనా పోస్, టి సుమతి, జి మల్లేశ్వరి, ఏ ధనలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

విశాలాంధ్ర-కనిగిరి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేయనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మోడల్ స్కూల్ సమీపంలో పూరి పాకల్లో నివాసముంటున్న ఎస్టి ప్రజలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన చరిత్ర వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాల మాజూరు చేయనున్నట్లు వారు తెలియజేశారు. ప్రజలంతా సంక్షేమ అభివృద్ధికి పట్టం కట్టి మరోసారి సీఎం జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి తహసీల్దార్‌గా సుజాత

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి తహసీల్దార్‌గా జి.సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

అర్జీదారులకు సత్వరమే పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర-ఒంగోలు : "స్పందన" కార్యక్రమంలో వచ్చే అర్జీలపై వెంటనే స్పందించి, అర్జీదారులకు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలు నందు జరిగిన "స్పందన" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్య మన్ పటేల్‌తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్ లో ప్రస్తావించిన వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వర రావు, ఝాన్సీ లక్ష్మి, జిల్లా పరిషత్ సిఈఓ జాలి రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ప్రకాశం జిల్లా కొత్త జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోపాలకృష్ణ రోణంకి తనిఖీలలో కొత్తదరబడి సృష్టించారు. సిబ్బంది ఎవరికీ సమాచారం ఇవ్వకుండా రేషన్ పంపిణీ చేసే వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఒంగోలు నగరంలోని ప్రకాశం కాలనీలో పంపిణీ చేస్తున్న మొబైల్ వాహనం నెంబర్ 81001 ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు వివరాలు జారీ విధానం పరిశీలించారు. అక్కడ ఉన్న రేషన్ కార్డుదారులతో నేరుగా మాట్లాడుతూ మొబైల్ వాహనదారు పంపిణీ విధానం ఎలా ఉంది, సక్రమంగా మొత్తం కోటా ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ అత్యంత వేగవంతంగాను మరియు పారదర్శకంగాను పూర్తి చేయాలి అని మొబైల్ వాహనదారును ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు ఉంటాయని ఏ విధమైన అక్రమాలు దృష్టికి వచ్చిన తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ



విశాలాంధ్ర - బాపట్ల : స్పందన అర్జీలు పునరావృతం కాకుండా సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమ వారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వరకట్న వేధింపులు, కుటుంబ సమస్యలు,భూవివాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఇతర సమస్యలతో 49 మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. ఫిర్యాదిదారులు సమస్యలను కూలంకషంగా విని, వారి అర్జీలను పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరిం చాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలను

అత్యున్నతస్థాయికి తీసుకెళ్తా

విశాలాంధ్ర-మార్టూరు : ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నూతన డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.షంషీర్ అలీభేగ్ కుమారుడు మీర్జా మహమ్మద్ మసూద్ అలీ భేగ్ పరిచయ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీధర్ అధ్యక్షతన సోమవారం కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మసూద్ సత్ప్రవర్తన, క్రమశిక్షణ, ఉన్నత భావాలు, నైతిక విలువలతో పెరిగారని, అంతే కాకుండా లండన్ లో ఉన్నత విద్యను పూర్తి చేసుకుని రావడం, కళాశాలకు డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడం శుభ పరిణామ మని కొనియాడారు. పురోగమనంలో ప్రయాణిస్తున్న కళాశాల మసూద్ రాకతో మరింత పురోభివృద్ధితో, అత్యుత్తమ ప్రమా ణాలతో ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ అన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ భేగ్ మాట్లాడుతూ వెనుక బడిన పశ్చిమ ప్రాంతంలో విద్యా రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు నాడు స్థాపించిన కళాశాల ఎన్నో మైలురాళ్లు దాటి ఉన్నత స్థితికి చేరుకుందని అన్నారు. కళాశాల అభివృద్ధిలో ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, సిబ్బంది సేవలు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. నూతన డైరెక్టర్ మసూద్ కు సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ ఎం. షంషీర్ అలీభేగ్ సిబ్బందిని కోరారు. నూతన డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ మసూద్ అలీ భేగ్ మాట్లాడుతూ డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించిన తండ్రి అలీ భేగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉన్న స్థితి నుంచి అత్యున్నత స్థితికి కళాశాలను తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, అందుకు మీ సహకారం ఎంతైనా అవసరం అని అన్నారు. ఉన్నత విలువలతో, అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో కళాశాల పేరు ప్రతిష్టలు పెంపొందించాలని కోరారు. ఈ సందర్భంగా సిబ్బంది నూతన డైరెక్టర్ మసూద్ కు అభినందనలు తెలిపారు.

గొంతు తడపాలంటే..

గంపెడు కష్టాలు!

యం.నిడమానూరులో తాగునీటికి కటకట

విశాలాంధ్ర- టంగుటూరు: మండలంలోని యం.నిడ మానూరు గ్రామంలో నాలుగురోజుల నుండి తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్తున్నారు. పంచాయతీ పరిధిలోని తాగునీరు సరఫరా చేసే బోరు మోటారు మరమ్మత్తులకు గురియై నాలుగురోజులు గడుస్తున్న పంచాయతీ సిబ్బంది, సర్పంచ్, ఎవరూ పట్టించుకోవడంలేదు అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పగలంతా పొలం పనులు చేసుకుని ఇంటికి వస్తే గుక్కెడు నీళ్లులేక గృహిణులు స్థానిక సాయిబాబా గుడి దగ్గర ఉన్నా కుళాయి నుండి బిందెలతో మోసుకు పోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. సమస్యను పంచాయతీ సెక్రెటరీ తెలుపగా అదిగో ఇదిగో బాగుచేయిస్తా అంటు కాలాయాపన చేస్తున్నా రని గ్రామానికి చెందిన కాకుమాను శ్రీను ఆరోపిస్తున్నారు. గొంతు తడపాలంటే గంపెడు కష్టాలు పడుతున్నట్లు చెప్పారు. మోటారును త్వరితగతిన బాగుచేసి, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

పొన్నలూరు ఎస్ఐగా రాజేశ్

విశాలాంధ్ర-పొన్నలూరు : పొన్నలూరు ఎస్ఐగా ఎం.వి.రాజేశ్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎర్రగొండపాలెం నుంచి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ కృషి చేస్తానని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా, అక్రమ మద్యం, పేకాట, కోడి పందాలు, గుట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దారవీడుకు.. వెంకట సైదులు

విశాలాంధ్ర-పెద్దారవీడు : పెద్దారవీడు ఎస్ఐగా వెంకట సైదుల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా బదిలీలపై పెద్దారవీడులో విధులు నిర్వహిస్తున్న రాజకుమార్ గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకట సైదులకు పోలీసులు ఘనంగా స్వాగతం పలికారు.

కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా డేనియల్ జోసఫ్ బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా డేనియల్ జోసెఫ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పొదిలి మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా కనిగిరి కి బదిలీ పై వచ్చారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన డీవీఎస్ నారాయణరావు గుంటూరు జిల్లా దాచేపల్లి కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డానియల్ జోసెఫ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా చరవ చూపుతానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్ డేనియల్ జోసెఫ్ కు చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, మాణిక్యరావు, మున్సిపాలిటీ పాలక వర్గ కౌన్సిలర్లు, సీపీఐ నాయకులు వై రవీంద్రబాబు, జిపి రామారావు, బాలిరెడ్డి, సుబ్బారావు, మేనేజర్ ప్రసాద్, పూర్ణిమ, సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు

ప్రజా ఉద్యమాలు అవశ్యం

విశాలాంధ్ర - చీరాల : ఏపీకి ప్రత్యేక హోదా,విభజన హామీలు సాధన కోసం ప్రజా ఉద్యమాలు అవసరమని నవ్యాంధ్ర చైతన్య నివేదిక, జన విజ్ఞాన వేదిక సాంస్కృతికవిభాగం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చీరాల, ఊరురా జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం చీరాల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రత్యేకహోదా , విభజన హామీలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోట మాట్లాడుతూ వైయస్ షర్మిల ఢిల్లీలో పార్లమెంట్ సాక్షిగా ఏపీ ప్రత్యేకహోదా, విభజన హామీలపై దీక్ష చేపట్టడం అభినందనీయమ న్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల పట్ల ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలందరూ రాజకీయ పార్టీలతీతంగా చర్చించి ఆలోచించాలన్నారు.సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసిపి,టిడిపి,పాలక పార్టీలు సీపీఎం, సీపీఐ, జనసేన వంటి ప్రతిపక్ష పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని ఏపీకి ప్రత్యేక విభజన హామీలు అమలు గురించి ప్రజలు విస్తృతంగా చర్చించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర విభజన హామీలను గాలికి వదిలేసాయని,ఏపీ సమగ్రాభివృద్ధికి హోదా కీలకమన్నారు. సీనియర్ సిటిజన్స్ చీరాల అసోసియేషన్ అధ్యక్షులు గాదె హరిహరరావు,మునగాల దశరథ రామయ్య,కే.బ్రహ్మా రెడ్డి , ఎస్.యల్లమందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిలోన్ కాలనీవాసులు నుంచి రక్షణ కల్పించండి

ఎస్పీని ఆశ్రయించిన రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల : వేటపాలెం మండలం సిలోని కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు తనను మానసికంగా వేధిస్తూ హత్య చేసేందుకు కుట్ర చేస్తున్నారని వారి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందని రక్షణ కల్పించాలని ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సిలోను కాలనీకి చెందిన దొంతుబోయిన రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు.ఆ కాలనీలో విద్యుత్ శాఖకు చెందిన సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నానని, ఆ శాఖకు సంబంధించిన కొంత స్థలంలో ఆకుకూరలు సాగు చేసుకుంటూ భార్య పిల్లలు తల్లితో కలిసి జీవిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో సిలోని కాలనీకి చెందిన శివ నాయుడు, మురుగేషన్ సత్తి వేలు,సిల్వెస్టర్ మురుగప్ప,అరుణ్ కుమార్ మరికొంతమంది

కలిసి విద్యుత్ శాఖకు చెందిన స్థలాన్ని అన్యాక్రాంతం చేయాలనే ఉద్దేశంతో గత కొంతకాలంగా తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జనవరి 29వ తేదీన నాపై దాడి చేసి మా ఇంటిని ధ్వంసం చేసేందుకు ప్రయత్నం చేశారని చెప్పారు. వేటపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని దీంతో కేసు నమోదు చేశారన్నారు. మానసికంగా పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చీరాల ఆసుపత్రిలో ఐదు రోజులు పాటు ఐసీయూలో ఉంచి వైద్యం చేయించారన్నారు. మరలా తనపై దాడి చేసి మరోసారి దుర్భాషలాడుతూ ఇంటిని ధ్వంసం చేయబోయారని తెలిపారు. విచారించి వారి నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

పరిధికి లోబడే వైద్యమందించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : గ్రామీణ వైద్యులు పరిధికి లోబడి మాత్రమే చికిత్సలు చేయాలని ఐటిడిఏ డిప్యూటి డిఎంఅండ్ హెచ్ వో, యర్రగొండపాలెం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహంలో సోమవారం గ్రామీణ వైద్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని చెప్పారు. పరిధికి మించి వైద్య చికిత్సలు చేయకూడదని పేర్కొన్నారు. పలు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడారు. అనంతరం డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణారెడ్డిలను గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షులు షేక్ వలీసాహెబ్, అధ్యక్షులు పల్లెపోగు జాషువ, ప్రధాన కార్యదరి యు మల్లికార్జునరావు, కోశాధికారి పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, కొమ్ము చిన్నబాబు, కోటా శాంసన్, తోంట్ల మస్తాన్ రెడ్డి, గురవయ్య, కోటి, కాటంరాజు, బాలకోటి, నక్కా వెంకటేశ్వర్లు, టంగుటూరి సత్యనారాయణ, సుబ్బరామయ్య, సుధాకర్, చిన్నబాబు, నరసింహ, మాబు, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు యాదవ్, రామయ్య, రాముడు, లక్ష్మణుడు, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకంటక ప్రభుత్వాలను గద్దెదింపుదాం

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజాకంటక పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. అధిక ధరల భారాలతో, ఎన్నికల హామీలను అమలు పరచక ప్రజా విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాయని, ఈ విధమైన ప్రజా వ్యతిరేక పాలకులను గద్దెదింపుదామని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని 30వ డివిజన్ ఏటీ అగ్రహారం ప్రాంతంలోని కమ్యూనిస్టు కాలనీ శాఖ సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య దేశమని మరిచిపోయి మెజారిటీ మతానికి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక పనులన్నీ దేవుడు పేరుతో, గుడి పేరుతో రూపుమాపే ప్రయత్నం చేస్తున్నాడని మండి పడ్డారు. ఈ హేయమైన చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, ఇక ఇటువంటి సాగవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలపై ఎనలేని భారాలు మోపిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నేడు 'సిద్ధం' పేరుతో రాష్ట్రంలో బహిరంగ సభలు నిర్వహిస్తున్నాడని, కానీ రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్ రెడ్డిని గద్దెదింపేం దుకు సంసిద్ధం అయ్యారని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఏటీ అగ్రహారంలోని కమ్యూనిస్టు కాలనీ శాఖ స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించి స్థానిక ప్రజల మన్ననలు చురగొన్నాలన్నారు. పార్టీ నిర్వహించే

కార్యదర్శి రెడ్డయ్య(చిన్న),

సహాయ కార్యదర్శి శ్రీనివాస్

కార్యక్రమాలలో పెద్దఎత్తున పాల్గొనా లని ఆకాంక్షిం చారు. నగర సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్, మంగా శ్రీనివాస్, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు రాంప్రసాద్, స్థానిక పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన నాయకత్వం ఎన్నిక:

కమ్యూనిస్టు కాలనీ శాఖ మాజీ కార్యదర్శి మూరబోయిన వెంకటేశ్వర్లు మరణించడంతో శాఖకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రెడ్డయ్య(చిన్న), సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇదే నా చివరి ప్రసంగం

– పార్లమెంట్‌లో ఎంపీ గల్లా జయదేవ్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఇదే నా చివరి ప్రసంగమని వివిధ కారణాల వల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయటం లేదని, ప్రజా జీవితంలో ఉండి పారిశ్రామికవేత్తగా కొనసాగడం అంత సులభం కాదని గ్రహించాను. కాబట్టి నా రాజకీయ జీవితానికి విరామం ఇవ్వా లని నిర్ణయించుకున్నాను. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, దేశా నికి సేవ చేయాలనే నా నిబద్ధత, సంకల్పం స్థిరంగా ఉంది. నా సంస్థల ద్వారా దేశ అభివృ ద్ధికి తోడ్పడాలని భావిస్తున్నాను. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను సృష్టించడం, దేశానికి ఆదాయాన్ని, సంపదను సృష్టించడం అనేక సంక్షేమ చర్యల ద్వారా ఇతర రూపంలో దేశానికి సేవ చేస్తానని పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ లోకసభలో మాట్లాడారు. తన కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని, ఆయన రాజకీయాలలోకి వచ్చిన విధానాన్ని తెలియ జేశారు. పార్లమెంట్ సభ్యుడిగా రెండుసార్లు అవకాశం ఇచ్చిన చంద్రబాబు నాయుడుకి, గెలిపి చిన గుంటూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభ స్పీకర్, సభ్యులకు, అధికారు లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి అభివృద్ధికి రూ.1500 కోట్లు, గుంటూరు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు రూ.1000 కోట్లు నిధులు సాధించాను. గుంటూరు లోక్‌సభ పరిధిలో దాదాపు 20వేల గృహాలు మంజూరు చేయబడ్డాయి. రాజధాని అమరావతి ప్రాంత 29 గ్రామాల రైతులకు పన్ను మినహాయింపు పొందడంలో విజయం సాధించాను. విభజన హామీలు, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని, ఈ సభలోనే హామీ ఇచ్చిన ఈ పవిత్రమైన వాగ్దానాలు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం ఎన్నికల సంఘం ప్రధాన విధి. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించే విషయంలో ఈసీ ఇచ్చిన ఆదేశాలను డీఆర్ఓలు, స్థానిక సిబ్బంది ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు.

షర్మిలకు భద్రత తగ్గించి... భయపెట్టాలని చూస్తారా?

విశాలాంధ్ర-గుంటూరు : వైఎస్ షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి జగన్ మోహన్ రెడ్డికి భయం పట్టుకుందని, ఎలా గైనా షర్మిలమ్మను కట్టడి చేయాలని ఆమెకు భద్రత తగ్గించి పరోక్షంగా భయపెట్టాలని చూస్తున్నారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. వైఎస్ షర్మిల రెడ్డి భద్రతను కుదించి జగన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు హిమని సెంటర్ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న షర్మిలమ్మకు సమాధానం చెప్పలేని పిరికి పంద జగన్‌మోహన్ రెడ్డి అని విమర్శిం చారు. ఒక మహిళా అని కూడా చూడకుండా పనిగట్టుకుని సోషల్ మీడియాలో వైసీపీ నాయకులు అసభ్య పద జాలంతో పోస్టులు పెడుతుంటే కట్టడి చేయాల్సిన జగనన్న చోద్యం చేస్తున్నారని, ఇది అతని చేతకాని తనానికి నిదర్శనమన్నారు. తక్షణమే సోషల్ మీడియా నింధితులను అరెస్టు చేసి శిక్షించాలని, షర్మిలమ్మకు భద్రతను పెంచాలని మస్తాన్ వలి డిమాండ్ చేశారు. లింగంశెట్టి ఈశ్వర రావు, షేక్ ఉస్మాన్, మద్దిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, వణుకూరి శ్రీనివాస్‌రెడ్డి, నూనె పవన్ తేజా, చుక్కా చంద్రపాల్, గద్దం పాల్ విజయ్ కుమార్, కె.బుజ్జి, మీరావలి, రహమాన్, రామకృష్ణ, షేక్ మస్తాన్, సయ్యద్ జాని తదితరులు పాల్గొన్నారు.

140 కుటుంబాలు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. జిల్లాలపాడు గ్రామానికి చెందిన చిలకల వెంకటేశ్వర్ రెడ్డి ఆయన సతీమణి సుబ్బరత్నమ్మ వైసీపీలో భారీ మెజారిటీతో గెలుపొందిన వారు రాజకీయ ఓనమాలు కాంగ్రెస్ పార్టీలో నేర్చుకొని ఉండి రాష్ట్రం విడిపోవడంతో అదే బాటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి పార్టీ గెలుపే లక్ష్యంగా జగనన్న ముఖ్యమంత్రి ధ్యేయంగా పనిచేసి వైసిపిలో కన్వీనర్‌గా ఉంటూ ప్రాదేశిక ఎన్నికలలో ఎంపీటీసీ, సర్పంచ్‌గా గెలుపొంది పనిచేసే ఎమ్మెల్యే అవమానాలకు గురి చేయటంతో జీర్ణించుకోలేని వారు పార్టీని వీడెందుకు సిద్ధమయ్యారు. ఇదే అదునుగా ప్రత్యర్థి పార్టీ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆలోచనలతో పార్టీలోకి సోమవారం భారీగా చేరారు. దాదాపుగా తమ సొంత గ్రామం జిల్లలపాడులో 140 కుటుంబాలు ఆయన వెంట టిడిపి కండువలు ఉగ్ర నరసింహారెడ్డి కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు శ్యామల కాశిరెడ్డి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గౌడ గట్ల హరికృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యద్దనపూడి సాల్మన్ రాజ్, మండల తెలుగు రైతు అధ్యక్షులు మీనిగ కాశయ్య, లాయర్ బాల నారాయణ, మండల అధికార ప్రతినిధి గంజి రాజశేఖర్‌రెడ్డి, వెన్న రమణారెడ్డి, బొబ్బ భూపాల్, చందా బాలకాశిరెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీవోగా నాగరాజు బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో గా కే నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్చార్జి ఏపీవోగా మురళి పనిచేస్తున్నాడు. ఆయన స్థానంలో తర్లుపాడు మండల ఏపీవోగా పనిచేస్తున్న కే నాగరాజు బదిలీపై ముల్లమూరు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఏఎంసీ చైర్మన్‌కు అభినందనలు ..

విశాలాంధ్ర-మార్కాపురం : వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ భేగ్, డైరెక్టర్ పిఎల్‌పి యాదవ్‌లను సోమవారం మార్కెట్ యార్డు కార్యాలయంలో డివిజన్ అభివృద్ధి అధికారి బివిఎస్ సాయి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో ఈవీఎంలు వద్దు

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : రాబోయే సాధారణ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయడానికి ఈవి ఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్‌ను ప్రవేశ పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో 'భారత్ బచావో ఆధ్వర్యంలో 'ఈవీఎంలు వద్దు బ్యాలెట్ ముద్దు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారత్ బచావో ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా నవజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి కూటమి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఓటరు అభిమతానికి భిన్నంగా ఈవీఎంతో అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన అగ్రదేశాలన్నీ ఎన్నికల్లో బ్యాలెట్‌నే వాడుతుంటే భారత దేశంలో ఈవీఎంలను వాడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా దేశంలోని అన్ని పార్టీలు, పౌర, ప్రజా సంఘాలు ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్‌నే తీసుకురావాలని పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు చిరతనగర్ల వాసు, మేలుకో ఆంధ్రప్రదేశ్ నాయకులు ప్రత్యూష సుబ్బారావు, అవాజ్ నాయకుడు చిష్టి, భీమ్‌సేన సేవ దళ్ నాయకులు నల్లపు నీలాంబరం, సామాజిక కార్యకర్త ఎన్.బ్రహ్మయ్య, సురేష్, పలుకూరి ప్రసాద్, దళిత మహాసభ నాయకులు కొరబండి ఆంథోనీ, పాగళ్ల ప్రకాష్ పాల్గొన్నారు.